క్లుప్తంగా


విద్యార్థులకు మార్కులిస్టుల పంపిణీ



విద్యార్థులకు పది మార్కులిస్టులు అందజేస్తున్న హెచ్‌ఎం అబ్దుల్ హకీం

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024- 2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు శనివారం హెచ్‌ఎం అబ్దుల్ హకీం ఉపాధ్యాయులతో కలిసి లాంగ్ మార్కులిస్టులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులకు పై చదువులు చదివి భవిష్యత్‌ను ఉన్నతంగా నిర్మించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు శనివారం కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ఘనంగా దస్తగిరయ్య ఉరుసు



దర్గాకు గంధం తీసుకెళ్తున్న భక్తులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కోట వీధిలో వెలసిన శ్రీ దస్తగిరిస్వామి ఉరుసు శనివారం ఘనంగా జరిగింది. శుక్రవారం అర్ధ రాత్రి గ్రామంలోని తాజ్ సుల్తాన్ దర్గా నుంచి ఊరేగింపుగా గంధం తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అనంతరం ఉదయం ఉరుసు మహోత్సవం నిర్వహించారు. భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గంధోత్సవంలో ఫక్కీర్లు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి.

పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : ఎన్నికల హామీ మేరకు వెంటనే గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ..చంద్రబాబునాయుడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

బంతిపూల సాగు..భలే బాగు!

- గతంతో పోల్చితే మండలంలో తగ్గిన సాగు విస్తీర్ణం
- పండుగల సమయాల్లో పెరిగిన అమ్మకాలు
- పూలసాగుపై ఆసక్తి చూపని రైతులు



పూడిచెర్లలో బంతిపూలు కోస్తున్న వ్యవసాయ కూలీలు



జాతీయ రహదారి ప్రక్కన సాగు చేసిన బంతిపూల తోట

ఓర్వకల్లు: బంతిపూల సాగు అన్నదాతలను ఆదుకుంటోంది. వాణిజ్య పంటల్లోకెల్లా లాభదాయకంగా ఉంటూ రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. సాగు చేసిన మూడు నెలలకే పంట కోతకు వస్తోంది. బంతి పూలకు ఎక్కువ కాలం నిల్వ ఉండే గుణం, ఆకర్షణీయమైన రంగు ఉండటంతో మార్కెట్‌లోనూ ఆశజనంగా ధరలు ఉండడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గణనీయంగా తగ్గిన బంతి సాగు

ప్రస్తుతం మండలంలోని కొమరోలు, సోమయాజులపల్లె, చెన్నశెట్టిపల్లె, పూడిచెర్ల, నన్నూరు గ్రామాలలో కలిపి సుమారు 40 ఎకరాలలో బంతి, మరో 50 ఎకరాలలో చామంతి పూల తోటలను సాగుచేసినట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది పూల సాగు 50 విస్తీర్ణం శాతం తగ్గినట్లు తెలుస్తోంది. బంతి పూల తోటల పట్ల రైతులకు అధికారులకు అవగాహన కల్పించకపోవడే గత ఏడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడానికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పండుగల సమయంలో మంచి డిమాండ్

సాధారణ రోజుల కంటే పండుగలు, ఉత్సవాలు, శుభ, అశుభ కార్యాల సమయంలో బంతిపూలకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. పండుగల అనుకూలంగా చేసుకొని రైతులు బంతి సాగు చేస్తారు. మేలైన రకాలను ఎంచుకొని సాగు చేస్తే ధరలు ఆశాజనకంగా ఉంటాయి. వీటిని జులై నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు నాటుతారు. మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు అవలంబిస్తే ఎకరాకు 8–10 టన్నుల వరకు దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు. బంతి సాగును సారవంతమైన గరక నేలలు, ఉదజని సూచిక 7 నుంచి 7.5 వరకు ఉండి, నీడలేని ప్రాంతాల్లో పండించుకుంటే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. ఆఫ్రికన్, ఫ్రెంచ్ బంతి రకాలు లభిస్తాయి. ఇందులో పూస నారింజ గైండ(ఆరంజ్ వర్ణం), పూస పసంతి గైండ(పసుపు వర్ణం), ఎండియు–1 జాతులు ఆఫ్రికన్ బంతి రకం కిందకు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. విత్తన మోతాదు ఎకరాకి సుమారు 800 నుంచి 1000 గ్రాముల వరకు విత్తనాన్ని నారుమడి పద్ధతిలో విత్తుకుంటారు.

పెట్టుబడి ఖర్చులు పెరగాయి



ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు పంటల దిగుబడి తగ్గడమే గాక, పెట్టుబడి ఖర్చులు భాగా పెరిగాయి. నా కొడుకు గత 15 ఏళ్ల నుంచి పొలాలను కౌలుకు తీసుకొని బంతి పూలను సాగుచేస్తున్నాడు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ కూలీలు కలిపి ఎకరానికి రూ.1 లక్ష పెట్టుబడి వచ్చింది. అధిక వర్షాలతో పూల దిగుబడి తగ్గాయి. బంతిపూలు బాగా పూస్తే రైతుకు ఎలాంటి నష్టం ఉండదు. సాధారణ రోజుల్లో కంటే వినాయక చవితి, నవరాత్రులు, దసర, దీపావళి పండుగలు రావడంతో డిమాండ్ పెరిగింది.

– కాశపోగు రత్నమ్మ, పూల రైతు, పూడిచెర్ల గ్రామం

కిడ్నీ ఇచ్చి కూతురిని కాపాడుకున్న తల్లి



ప్రత్యూష, జయమ్మలతో వైద్యుల బృందం

కర్నూలు (హాస్పిటల్) : రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న కూతురికి షుగర్‌తో బాధ పడుతున్నా లెక్క చేయకుండా ఓ తల్లి తన కిడ్నీ ఇచ్చి కాపాడుకుంది. వివరాలను శనివారం కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ హెరూర్ వివరించారు. డోన్‌కు చెందిన ప్రత్యూష (34) కొన్ని సంవత్సరాలుగా రెండు కిడ్నీలు విఫలమై బాధ పడుతున్నారు. ఆమె బాధ చూడలేక తల్లి జయమ్మ (55) కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇద్దరిదీ ఎ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కావడంతో వైద్యులు సైతం అంగీకరించారు. అయితే జయమ్మకు బ్లడ్ షుగర్ ఉండటంతో కిడ్నీ ఇవ్వొద్దని పలువురు సూచించినా వినకుండా ఆమె ముందుకు కదిలారు. ఈ మేరకు గత జులై 14న మెడికవర్ హాస్పిటల్‌కు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుని షుగర్‌ను నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఈనెల 24న తల్లి, కూతురిని ఆసుపత్రిలో చేర్చుకుని కిడ్నీ మార్పిడికి అవసరమైన పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ మార్పిడికి షుగర్ వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారణ కావడంతో 27వ తేదీన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఇద్దరూ కోలుకోవడంతో శనివారం వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా మాత నిమజ్జనం



కళాకారులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: నన్నూరు గ్రామంలోని రాగమయూరిలో కొలువుంచిన దుర్గా మాత అమ్మవారిని శనివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటలు, వివిధ వేషధారణల్లో కళాకారులు అలరించారు. కల్లూరు అర్బన్ 21వ వార్డులో కొలువైన దుర్గా మాత అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఓర్వకల్లు మండల అధ్యక్షులు చెన్నారెడ్డి, ఎంపీపీ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

గడివేముల: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ శారద బాయి సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కిరణ్‌కు సూచించారు. ఆసుపత్రిలోని టీబీ రికార్డులను పరిశీలించారు. టీబీ రోగులకు ఎప్పటికప్పుడు మందులను అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీ సేవ లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన నిర్వహించాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

7న విజయవాడలో ధర్నా

గడివేముల: ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ ఉపాధ్యాయ, ఉద్యోగుల పరిష్కారంలో ఎలాంటి చొరవ చూపకపోవడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్. బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి బొకే అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

కోడుమూరు రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ శనివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మణిగాంధీ మాట్లాడుతూ జగనన్న తనపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చారన్నారు. కోట్ల హర్ష మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలంతా కలిసి కట్టుగా పనిచేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆబేల్, నాయకులు శేఖర్, ఆలీ, నాగరాజు, శ్రీను, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి



జీఎస్టీ కమిటీల విధానాలు తెలియజేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి

సి.బెళగల్: జీఎస్టీ స్లాబ్‌లలోని మార్పుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మండల అధికారులతో కలిసి వీఓఏలతో సమావేశమై మాట్లాడారు. జీఎస్టీ అంశాలు, మండల, గ్రామ స్థాయి కమిటీల విధానాలపై డిప్యూటీ ఎంపీడీఓ అవగాహన కల్పించారు. జీఎస్టీ స్లాబ్ మార్పు వస్తువుల ధరలు ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చాయని, కొత్త స్లాబ్ అంశాలపై వచ్చే నెల 19వ తేది వరకు జీఎస్టీ సంబరాల మాసంలో భాగంగా మండల, గ్రామ స్థాయి కమిటీలు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో ఎంఈఓ జ్యోతి, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఆయా శాఖల మండల అధికారులు, వెలుగు సీసీలు, వీఓఏలు హాజరు అయ్యారు.

న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలి



పాణ్యం సబ్‌స్టేషన్ వద్ద పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

పాణ్యం: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని ఏఈ మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపట్టనున్న సమ్మె కరపత్రాలను విద్యుత్ ఉద్యోగులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కాంట్రాక్టు జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, అరియర్స్ చెల్లించాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్–2ను రెగ్యులర్ చేయాలన్నారు. పీఆర్‌సీ అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న ఈపీడీసీఎల్ వద్ద, 8న ఏపీఎస్పీడీసీఎల్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. 13న చలో విజయవాడ, 15న నిరవధిక సమ్మె ఉంటుందన్నారు. విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

కూటమి పాలనలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువు



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ లేకుండాపోయిందని, విజయవాడలోని భారీ విగ్రహాన్ని కూడా గతంలో కొందరు దుండగులు పెకిలించే ప్రయత్నం చేశారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. తాజాగా చిత్తూరు జిల్లాలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నిప్పుపెట్టడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం కర్నూలు న్యూసిటీ కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు ప్రయోజనం

- డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల



కరపత్రాలను విడుదల చేస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల

ఓర్వకల్లు: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో నిత్యావసరాలతో పాటు వ్యవసాయ పరికరాలు, కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గిందన్నారు. దుకాణదారులు పాత ధరలకు అమ్మితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం జీఎస్టీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఏఓ మధుమతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల మీట్

- ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు
- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు ఏదీ
- కూటమి ప్రభుత్వ తీరుపై జెడ్పీటీసీ ఆగ్రహం
- రీసర్వే, మినీ గోకులాల జాబితాపై అసహనం..



సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదిక చదువుతున్న ఏఓ రవిప్రకాష్



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం మాటలు చూస్తే కోటలు దాటిస్తోంది.. క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్‌లు కూడా చేయడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి మండిపడ్డారు. దాదాపు ఏడాదిన్నర నుంచి రోడ్ల మరమ్మతుల ఊసే లేదని చెప్పారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్వర్యంలో ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ఎంటీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను లేవనెత్తారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. రీసర్వే సందర్భంగా తలెత్తుతున్న భూవివాదాల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సందెప్ప సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు తమ పరిధిలో ఉన్న వాటిని మాత్రమే పరిష్కరించగలమని తహసీల్దార్ నాగరాజు పేర్కొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ రవి ప్రకాష్ సభనుద్దేశించి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు 90శాతం మేర పూర్తయిందని చెప్పారు . ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాలతో హంద్రీనదికి వరదనీరు పోటెత్తి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలకు మంచినీటినందించే పథకాలు మునిగిపోయాయని, దీంతో కొన్ని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తిందన్నారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. మండలానికి మంజూరైన మినీ గోకులాలను అర్హులైన పాడి రైతులకే ఇవ్వాలని అనర్హులకు మంజూరు చేస్తే ఊరుకునేది లేదని జెడ్పీటీసీ చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ గంగరాజు, ఏపీఎం రాయుడు, ఈఓఆర్డీ మంజుల, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, హౌసింగ్ ఏఈ లాల్ క్రిష్ణయ్య, ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖలకు సంబంధించిన అధికారులు తమ తమ ప్రగతి నివేదికలను చదివి విన్పించారు. అనంతరం జీఎస్టీ అసిస్టెంట్ ఆఫీసర్ రమాదేవి జీఎస్టీ తగ్గింపుపై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మీ వేధింపులు భరించలేం!

మునిసిపల్ కమిషనర్ తీరు పట్ల విసిగిన ఉద్యోగులు

- తాజాగా రెవెన్యూ సూపరింటెండెంట్‌కు అవమానం
- గెటౌట్.. సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరిక
- కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని వెల్లడి
- సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల మద్దతు



సెంట్రల్‌ప్లాజా వద్ద డివైడర్ల మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్ (ఫైల్)



కమిషనర్ తీరుపై మేయర్ బీవై రామయ్యకు ఫిర్యాదు చేస్తున్న సూపరింటెండెంట్, మున్సిపల్ ఉద్యోగులు

కర్నూలు (టౌన్) : కర్నూలు నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నిత్యం సమీక్షలు, సమావేశాలు, ఎక్కడున్నారో తెలుసుకోకుండా వెంటనే కార్యాలయానికి రమ్మనడం, కారణం వినకుండా దండించడం ఈ మధ్య ఎక్కువైందని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ రెండున్నర నెలల వ్యవధిలోనే పలువురికి షోకాజ్‌నోటీసులు, 20 మందికి పైగా ఉద్యోగులకు మెమోలు, ముగ్గురు ఉద్యోగులకు సస్పెన్షన్‌లు జారీ అయ్యాయి. కింది స్థాయి ఉద్యోగులనే కాకుండా సెక్షన్ హెడ్‌లకు కూడా ఈ కొత్త కమిషనర్ మెమోలు జారీ చేస్తున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదని.. అప్పగించిన పనులన్నీ చేస్తున్నా ఈ వేధింపులు ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా శనివారం కమిషనర్ రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్‌ను గెటౌట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సస్పెండ్ చేస్తానంటూ బెదిరించాడు.

ఏం జరిగిందంటే...

శనివారం నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, అడ్మిన్లు, అమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్ పి. విశ్వనాథ్ సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంలో కమిషనర్ రెవెన్యూ విభాగానికి చెందిన సూపరింటెండెంట్ అబ్దుల్ వాజిద్‌ను పన్ను బకాయిదారుల జాబితా అడిగి ఎంత మంది ఉన్నారు. ఎంత కలెక్షన్ వచ్చిందన్నారు. సచివాలయాల్లోని కార్యదర్శులతో మాట్లాడి వివరాలు ఇస్తుండగానే కమిషనర్ చిర్రుబుర్రులాడారు. గెటౌట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. అవమానంగా భావించిన సదరు సూపరింటెండెంట్ కుటుంబ సభ్యులను పిలిపించుకొని పెట్రోల్‌తో కార్యాలయానికి వచ్చారు. తోటి ఉద్యోగులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికే కమిషనర్ వ్యవహారి శైలితో విసిగిన ఉద్యోగులతో పాటు మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ కూడా సూపరిటెండెంట్‌కు మద్దతుగా నిలిచారు. కమిషనర్ వ్యవహార శైలిపై తాడో పేడో తేల్చుకోవాలని నిర్ణయించుకొని

అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణను బాధిత సూపరింటెండెంట్‌తో పాటు వెళ్లి కలిశారు. కమిషనర్ ఉద్యోగుల పట్ల చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, ఇది మంచి సంప్రదాయం కాదని చెప్పారు. తర్వాత నగర మేయర్ బీవై రామయ్యను కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. కమిషనర్ తీరు మార్చుకోకపోతే పనిచేయలేం అంటూ స్పష్టం చేశారు. మేయర్ వారిని వారించి కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబంలా ఉందామని కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు.

మూకుమ్మడి సెలవుల్లో మున్సిపల్ ఉద్యోగులు ?

అకారణంగా మెమోలు ఇవ్వడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం వంటి చర్యలతో ఉద్యోగులు విసిగిపోయారు. వారం పదిరోజుల్లో కమిషనర్ తీరులో మార్పు రాకపోతే మూకుమ్మడి (సీఎల్)గా సెలవుల్లో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి కమిషనర్ పి. విశ్వనాథ్ వచ్చిన తర్వాత కర్నూలు నగరంలో పెద్దగా అభివృద్ధి పనులు, బిల్లుల క్లియరెన్స్ జరగలేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో కన్నా ఇప్పుడే శానిటేషన్ సమస్య జఠిలంగా మారింది. ఈ సమస్య పరిష్కారంపై కమిషనర్ దృష్టి సారించకుండా తమను మానసికంగా వేధిస్తే ఎలా అని దీనిపై త్వరలోనే కర్నూలు మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరిని కలిసి చెబుతామని ఉద్యోగులు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే రాక కోసం ఆటోడ్రైవర్ల పడిగాపులు

కోడుమూరు రూరల్: 'ఆటో డ్రైవర్ సేవ' పథకం కింద ఆటో డ్రైవర్లకు శనివారం కోడుమూరులో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలలోపు రావాలని అధికారులు చెప్పడంతో నియోజకవర్గంలోని ఆటోడ్రైవర్లు ఆటోలతో సహ చేరుకున్నారు. అయితే, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వచ్చాక మెగా చెక్కు పంపిణీ ఉంటుందని గంటల తరబడి నిరీక్షింపజేశారు. మధ్యాహ్నం 2 గంటలైనా ఎమ్మెల్యే రాకపోవడంతో కొందరు వెనుదిరిగిపోయారు. చివరకు 2.30 గంటల సమయంలో ఎమ్మెల్యే వచ్చి చెక్కు పంపిణీ చేశారు. అన్ని పనులు వదులుకొని వచ్చిన తమను గంటల తరబడి నిరీక్షింపజేయడం సరికాదని పలువురు ఆటో డ్రైవర్లు ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు.

సర్దార్ అమరావతమ్మ చిరస్మరణీయురాలు

కర్నూలు కల్చరల్ : దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధురాలు సర్దార్ అమరావతమ్మ అని రాయలసీమ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంధం అరుణ అన్నారు. బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో శనివారం టీజీవీ కళాక్షేత్రంలో సర్దార్ అమరావతమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమరావతమ్మ పోరాటం, సేవలు చిరస్మరణీయమన్నారు. మహిళలు గుమ్మం దాటి బయటకు రాని పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు వచ్చి సర్దార్ నాగప్పతో పాటు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ధీశాలి అమరావతమ్మ అని బహుజన విద్యావంతుల వేదిక అధ్యక్షులు దాసరి రామశేషయ్య అన్నారు.